సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 6 । ఆగస్టు । 2025



స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తక్షణమే ఆపాలి 10లో



యాజమాన్యం నిర్లక్ష్యంతోనే లుపిన్ ఫార్మా ప్రమాదం 10లో



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రారంభం 10లో

నచ్చిన కంపెనీల కోసం...
వచ్చిన సంస్థల్ని వదిలేసి?

విశాఖ 'పర్యాటకం'లో వింతపోకడలు

విశాఖ పర్యాటక రంగం అభివృద్ధికి 2023లో అప్పటి ప్రభుత్వం అనేక సంస్థలతో రూ.8,806 కోట్ల విలువైన 64 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదుర్చుకుంది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ ఒప్పందాలను పట్టించుకోవడం లేదు. పాత సంస్థలను పక్కన పెట్టి, తమకు నచ్చినవారికి భూములు కేటాయించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో పర్యాటక శాఖ అధికారులు కూడా పాత ఎంవోయూలను విస్మరించి, కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు.



విశాఖలో టూరిజం ప్రాజెక్టుల పేరుతో కన్నేసిన మొత్తం భూమి	అనకాపల్లి జిల్లాలో	అల్లూరి జిల్లాలో
176.15 ఎకరాలు	22.67 ఎకరాలు	43.10 ఎకరాలు
	మొత్తం 241.92 ఎకరాలు	

- జీఐఎస్–2023లో పదుల సంఖ్యలో పర్యాటక ఒప్పందాలు
- జిల్లా పరిధిలో అడ్వెంచర్, హోటల్స్, వాటర్‌స్పోర్ట్స్ సంస్థలతో ఎంవోయూలు
- స్థలాలు చూపిస్తే పర్యాటక ప్రాజెక్టులు పట్టాలెక్కించేందుకు సిద్ధం
- అయినా పట్టించుకోకుండా కొత్త సంస్థలు రావాలంటూ పిలుపు
- ఉమ్మడి విశాఖలో మొత్తం 241.92 ఎకరాలపై కన్ను



సాక్షి, విశాఖపట్నం : టూరిజం కేంద్రంగా విశాఖ.. గత ప్రభుత్వ హయాంలో కొత్త ప్రాజెక్టులతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో అనేక ప్రయత్నాలు జరిగాయి. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే విధంగా, విశాఖను ప్రపంచ పర్యాటక పటంలో నిలిపేందుకు భారీ ప్రాజెక్టులు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా, జీఐఎస్–2023లో విదేశీ సంస్థలకు రాయితీలు ఇస్తూ, పీపీపీ (ప్రైవేట్–పబ్లిక్ పార్టనర్‌షిప్) విధానంలో రూ. 8,806 కోట్ల విలువైన పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయి. అయితే ప్రాజెక్టులు ప్రారంభమయ్యే సమయంలో ప్రభుత్వం మారడంతో, కూటమి ప్రభుత్వం ఈ పర్యాటక ప్రాజెక్టులను పట్టించుకోవడం లేదు. గతంలో కుదిరిన ఒప్పందాలపై కనీసం ఒక్కసారైనా సమీక్ష నిర్వహించలేదు. ఎంవోయూలు చేసుకున్న సంస్థలు భూమి కేటాయిస్తే పనులు ప్రారంభిస్తామని అడుగుతున్నా ప్రభుత్వం స్పందించలేదు. దీనికి తోడు, కొత్తగా ప్రాజెక్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా టూరిజం అధికారులు ప్రకటించడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

64 ప్రాజెక్టులు రూ.8806 కోట్లు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి 'రిక్రియేషన్ టూరిజం'కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జీఐఎస్–2023లో సింగపూర్, టర్కీ, ఫ్రాన్స్ వంటి దేశాల నుంచి వచ్చిన సంస్థలతో రూ.8,806 కోట్ల విలువైన 64 పర్యాటక ప్రాజెక్టులకు ఎంవోయూలు కుదిరాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో 18,205 మందికి ప్రత్యక్షంగా, మరో 20 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలిగేవి. అయితే ప్రభుత్వం మారిన తర్వాత ఈ సంస్థలు ప్రస్తుత కూటమి ప్రభుత్వం చుట్టూ తిరిగినా ఎలాంటి స్పందనా రాలేదు. భూమి కేటాయిస్తే వెంటనే పనులు ప్రారంభిస్తామని కోరినా, భూ కేటాయింపులు ఇప్పట్లో ఉండవంటూ అధికారులు వారిని వెనక్కి పంపించారు. దీనివల్ల పర్యాటక ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

రూ.కోట్లు విలువ చేసే స్థలాలపై కూటమి కన్ను

గత ప్రభుత్వ హయాంలో కుదిరిన ఒప్పందాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం పక్కన పెడుతోందని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో వచ్చిన ప్రాజెక్టులను విస్మరించి, తమ అనుచరులకు పర్యాటక ప్రాజెక్టుల పేరుతో భూములు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండ్ కో వ్యూహరచన చేసింది. దీనిలో భాగంగానే ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని పర్యాటక భూముల్లో కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తమ నియోజకవర్గాల పరిధిలోని విలువైన పర్యాటక భూములను అనుచరులకు కట్టబెట్టడానికి కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారు. దీనికి జిల్లా పర్యాటక శాఖ అధికారులు కూడా సహకరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించకుండా.. ఉన్న భూములను కూటమి నాయకులకు ధారాదత్తం చేయడానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. కూటమి నాయకుల ఆదేశాల ప్రకారం, వారే చెప్పిన వారికి భూ కేటాయింపులు చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని సమాచారం.


కూటమికి షాక్!

- స్థాయీ సంఘం ఎన్నికకు జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ దూరం
- జనసేనలో ఒక్కరికి కూడా అవకాశం కల్పించకుండా అవమానించారని ఆవేదన

డాబాగార్డెన్స్ : కూటమికి గట్టి షాక్ తగిలింది. ఇంత వరకు చెట్టాపట్టాలేసుకుని పైపైకి కనిపించినా.. కూటమిలో లుకలుకలు బహిర్గతమయ్యాయి. అవిశ్వాస తీర్మానం సమయంలో మేయర్ పదవి టీడీపీకి, డిప్యూటీ మేయర్ పదవి జనసేనకు కట్టబెట్టే యత్నంలో ఎంతో అన్యోన్యంగా వ్యవహరించిన ఆ రెండు పార్టీల్లో విభేదాలు తారా స్థాయికి చేరాయి. జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల్లో కనీసం ఒక్క సీటు కూడా జనసేనకు కేటాయించకపోవడంతో విభేదాలు ముదిరి పాకాన పడ్డాయి. జీవీఎంసీ కౌన్సిల్ చివరి స్థాయీ సంఘం ఎన్నికల్లో కూడా జనసేన పార్టీలో ఉన్న వారికే కాదు.. ఆ పార్టీ పంచన చేరిన వారికి కూడా అవకాశం దక్కలేదు. అంతేగాక స్వతంత్ర కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ జనసేన దక్షిణ నియోజకవర్గ టికెట్ ఆశించి భంగపడ్డారు. అయినప్పటికీ జనసేనలోనే కొనసాగుతూ వచ్చారు. పార్టీ ఏదో పదవి ఇస్తుందన్న ఆశతో పార్టీలోనే ఉంటూ స్థాయీ సంఘం ఎన్నికల్లో బరిలో నిలిచినా.. కూటమి నాయకులు సాధిక్‌తో విత్‌డ్రా చేయించారు. కూటమిలో జనసేనకు ఎంత గౌరవం ఉందో అప్పుడే తేలిపోయింది. తాజాగా జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్టు ప్రకటించారు. కూటమి ధర్మం ప్రకారం స్థాయీ సంఘం ఎన్నికల్లో జనసేన కార్పొరేటర్లకు మూడు స్థానాలు ఇవ్వాలని, అటువంటి అవకాశం లేదంటే..కనీసం ఒక్క స్థానమైనా ఇవ్వాలని, అదీ ఇవ్వలేదని మూర్తి యాదవ్ పేర్కొన్నారు. గత స్థాయీ సంఘం ఎన్నికల్లో కూడా జనసేనకు మొండి చెయ్యి చూపారని, తాజాగా ఎన్నికల్లో కూడా ఖాళీ చెయ్యి చూపించారంటూ మండిపడ్డారు. స్థాయీ సంఘంలో జనసేనకు సముచిత స్థానం ఉంటేనే నగరాభివృద్ధికి.. ప్రజా సేవకు అవకాశం ఉండేదని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందంటూ బాహాటంగానే చెప్పుకొచ్చారు. 14 మంది జనసేన కార్పొరేటర్లలో (ఫిరాయింపు కార్పొరేటర్లతో కలిపి) ఒక్కరికైనా స్థాయీ సంఘం ఎన్నికల్లో అవకాశం కల్పించి ఉంటే సముచిత గౌరవం ఇచ్చినట్టు ఉండేదని, ఆ విధంగా ఇవ్వకపోగా నామినేషన్ వేసిన వారిని కూడా విత్‌డ్రా చేయించి అవమానపరిచారని తెలిపారు. కూటమిలో జరిగిన ఈ అవమానాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు పేర్కొన్నారు.

అనైతిక రాజకీయాలకు కూటమి తెర?

- స్టాండింగ్ కమిటీ ఎన్నికలో ప్రలోభాలు
- 27 మంది ఫిరాయింపు కార్పొరేటర్లకు నిబంధనలకు విరుద్ధంగా ఓటు హక్కు
- ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న అధికారులు, కూటమి నేతలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక నేపథ్యంలో కూటమి నేతలు అనైతిక రాజకీయాలకు తెర లేపుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మండిపడ్డారు. మంగళవారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీలో గెలిచిన 27 మంది కార్పొరేటర్లు నిబంధనలకు విరుద్ధంగా ఫిరాయింపునకు పాల్పడ్డారని, వారికి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికే విరుద్ధంగా ఓటు హక్కు కల్పిస్తున్నారంటూ మండిపడ్డారు. అంతేకాకుండా బుధవారం జరగనున్న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలో కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేయడమే కాకుండా ఓటుకు నోటు రాజకీయాలకు పాల్పడుతున్నార న్నారు. ఓటమి భయంతో అనైతిక పద్ధతిలో విజయం సాధించేందుకు క్యాంపు రాజకీయాలకు, ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కూటమి నేతలు, అధికారులు ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నారని, ఫిరాయింపుదారులకు ఓటు హక్కు తొలగించి స్టాండింగ్ కమిటీ ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతో కార్పొరేటర్లను ఒక ప్రైవేట్ రిసార్ట్‌కు తరలించారన్నారు.

న్యూస్‌రీల్

రికార్డుల్లో చంపేశారు..



రికార్డుల్లో చనిపోయినట్లు చూపిస్తున్న దృశ్యం

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీకి చెందిన మహిళా ఆదర్శ రైతు మామిడి సూరమ్మ ఏడాదిగా అన్నదాత సుఖీభవ కోసం ఎంతో ఆశగా ఎదురుచూసింది. ప్రభుత్వం ఈనెల 2వ తేదీన ఈ పథకం ద్వారా రూ.5 వేలు చొప్పున నిధులను రైతులకు జమ చేయగా ఆమెకు మాత్రం రాలేదు. దీంతో ఆమె రైతు సేవా కేంద్రానికి వెళ్లి సిబ్బందిని అడిగింది. వారు తనిఖీ చేసి సూరమ్మ చనిపోవడం వల్ల రిజెక్ట్ చేసినట్లు తెలిపారు. తాను బతికి ఉండగానే చంపేస్తారా? అని ఆమె సిబ్బందిని నిలదీయగా పొరపాటున అలా జరిగిందని తిరిగి అప్‌లోడ్ చేసి పథకం డబ్బులు అందేలా చూస్తామని చెప్పి పంపించేశారు.

కరాళ చందనం అరగదీత



కరాళ చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం కరాళ చందనం అరగదీత కార్యక్రమం జరిగింది. ఈ నెల 9న వచ్చే శ్రావణ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి ఈ చందనాన్ని సమర్పిస్తారు. ఈ క్రమంలో ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఏఈవో తిరుమలేశ్వరరావు పర్యవేక్షించారు.

సైన్స్ ఉపాధ్యాయులకు నేటి నుంచి శిక్షణ తరగతులు

ఆరిలోవ: జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు బుధ,గురువారాల్లో 'ఇన్‌స్పైర్ మనక్–2025' శిక్షణ తరగతులు డివిజన్ల వారీగా నిర్వహించనున్నట్లు డీఈవో ఎన్. ప్రేమ్‌కుమార్ మంగళవారం పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డీఈవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు జరగనున్నాయి. బుధవారం ఆనందపురం, పద్మనాభం, భీమిలి, చినగదిలి, సీతమ్మధార మండలాల పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు, గురువారం గాజువాక, పెదగంట్యాడ, గోపాలపట్నం, ములగాడ, మహారాణిపేట మండలాల సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహిస్తామన్నారు.

కోస్తాంధ్ర తీర ప్రాంత రక్షణకు చర్యలు



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు మల్లికార్జునరావు

ఆరిలోవ : రాష్ట్రంలో కోస్తాంధ్ర తీర ప్రాంత రక్షణకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఎఫ్‌ఎస్ ఆఫీసర్ పి.మల్లికార్జునరావు తెలిపారు. రెండు రోజులపాటు విశాఖ ఫారెస్ట్ సర్కిల్ సందర్శనలో భాగంగా మంగళవారం ఆయన ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కు, కంబాలకొండ ఎకో టూరిజం పార్క్‌ను సందర్శించారు. అనంతరం జూ సమావేశ మందిరంలో అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. విశాఖ రీజియన్‌లో అడవుల సంరక్షణ, వాటి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్'గా తీర ప్రాంతాన్ని తీర్చిదిద్దడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా కోస్తాంధ్ర 12 జిల్లాల్లో ఉన్న 974 కి.మీ తీర ప్రాంతంలో సుమారు 600 కి.మీల్లో పలచబడిన పచ్చదనాన్ని పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ తీర ప్రాంతమంతటా 2 లక్షల తాటి విత్తనాలు నాటనున్నామన్నారు. వాటితో పాటు ఖర్జూరం, ఈత తదితర మొక్కలు కూడా నాటించే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 344 కి.మీ తీర ప్రాంతం ఉందని, ఇక్కడి వాతావరణం ఆధారంగా ఎలాంటి మొక్కలు నాటాలో అధ్యయనం చేస్తున్నామన్నారు. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో అడవుల నుంచి వచ్చి రైతుల పంటలను నాశనం చేస్తున్న ఏనుగుల నుంచి రక్షించడానికి రెండు కుంకి ఏనుగులను తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏటికొప్పాక బొమ్మల తయారీ కోసం వినియోగించే అంకుడు తదితర కలపను అటవీశాఖ నుంచి సరఫరా చేసే ఆలోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో విశాఖ రీజియన్ సీఎఫ్ మైథీన్, జూ క్యూరేటర్ జి.మంగమ్మ, డీఎఫ్‌వోలు, సబ్ డీఎఫ్‌వోలు పాల్గొన్నారు.

నేడు స్టాండింగ్ కమిటీ ఎన్నిక

- 10 మందిని ఎన్నుకోనున్న కార్పొరేటర్లు
- బరిలో వైఎస్సార్ సీపీ, టీడీపీ



డాబాగార్డెన్స్: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) స్టాండింగ్ కమిటీ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. కౌన్సిల్ హాల్లో ఉదయం 10 గంటలకు మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటిస్తారు. ఈ ఎన్నికల్లో స్టాండింగ్ కమిటీలోని 10 స్థానాల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పది మంది, తెలుగుదేశం పార్టీ నుంచి పది మంది కార్పొరేటర్లు పోటీ పడుతున్నారు. ఇదిలావుండగా జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికలో సీపీఎం పాల్గొనడం లేదని సీపీఎం జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పేర్కొన్నారు. అలాగే 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కూడా ఓటింగ్‌లో పాల్గొవడం లేదని స్పష్టం చేశారు.

ఓటింగ్ ప్రక్రియ ఇలా..

స్థాయీ సంఘం ఎన్నికలు ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలోనే జరుగుతాయి, కానీ ప్రాధాన్యత ఓట్లు ఉండవు. ఒక్కో కార్పొరేటర్‌కు 10 ఓట్లు ఉంటాయి. కార్పొరేటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకుంటే మొత్తం 95 ఓట్లు పోలవుతాయి. ఒకే బ్యాలెట్ పేపర్‌పై వైఎస్సార్ సీపీ, టీడీపీకి చెందిన 20 మంది అభ్యర్థుల పేర్లు ఉంటాయి.కార్పొరేటర్లు తమకు నచ్చిన 10 మంది అభ్యర్థుల పేర్ల ముందు టిక్ చేసి ఓటు వేయాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థికి ఒక ఓటు చొప్పున గరిష్టంగా 10 మందికి 10 ఓట్లు వేయవచ్చు. ఎవరైనా 11 ఓట్లు వేస్తే ఆ ఓటు చెల్లనిదిగా పరిగణిస్తారు. ఒక అభ్యర్థికి 48 ఓట్లు వస్తే విజేతగా ప్రకటిస్తారు.

పోటీలో ఉన్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు

నిక్కల లక్ష్మి (20వ వార్డు), సాడి పద్మారెడ్డి (24వ వార్డు),పల్లా అప్పలకొండ (28వ వార్డు),బిపిన్ కుమార్ జైన్ (31వ వార్డు), గుండపు నాగేశ్వరరావు (40వ వార్డు), కోడిగుడ్ల పూర్ణిమ (41వ వార్డు), రెయ్యి వెంకటరమణ (51వ వార్డు), కేవీఎన్ శశికళ (55వ వార్డు), మహ్మద్ ఇమ్రాన్ (66వ వార్డు), ఉరుకూటి రామచంద్రరావు (70వ వార్డు)

టీడీపీ నుంచి..

మొల్లి హేమలత (5వ వార్డు), సేనాపతి వసంత (96వ వార్డు), రాపర్తి త్రివేణి వరప్రసాదరావు (92వ వార్డు),దాడి వెంకట రామేశ్వ రరావు (88వ వార్డు), రౌతు శ్రీనివాస్ (78వ వార్డు), మొల్లి ముత్యాలు (87వ వార్డు), మాదంశెట్టి చిన్నతల్లి (83వ వార్డు), కొణతాల నీలిమ (79వ వార్డు), గేదెల లావణ్య (17వ వార్డు), గంకల కవిత (47వ వార్డు)

అప్పన్న లడ్డూ నాణ్యత పెంపుపై ట్రయల్ రన్

- త్వరలో 400 గ్రాముల కల్యాణ లడ్డూ విక్రయాలు
- ఈవో వి.త్రినాథరావు వెల్లడి



లడ్డూ చుట్టే ప్రక్రియను పరిశీలిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: రాష్ట్రవ్యాప్తంగా లడ్డూ ప్రసాదం అందించే ప్రధాన దేవాలయాల్లో లడ్డూ నాణ్యత మరింతగా పెంపొందించేందుకు, ఒకే విధమైన నాణ్యత ఉండేలా అన్ని దేవాలయాల్లో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై ప్రసాదాల తయారీశాలలో ఈవో స్వీయ పర్యవేక్షణలో లడ్డూ తయారీని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఈవో మాట్లాడుతూ రాష్ట్రంలో లడ్డూ ప్రసాదం అందించే ప్రధాన దేవాలయాల్లో విజయవాడ కనకదుర్గ ఆలయంలో ఉన్న దిట్టాన్ని(ముడిసరకుల కొలత) ఇప్పటి వరకు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక దిట్టానికి పది కిలోల శెనగపిండి, 20 కిలోల పంచదార, 6 కిలోల నెయ్యి, 750 గ్రాముల జీడిపప్పు, కిస్మిస్ 500 గ్రాములు, యాలకులు 75 గ్రాములు,జాజికాయ,పచ్చకర్పూరం 15 గ్రాములు చొప్పున వినియోగిస్తున్నామన్నారు. ఒక దిట్టానికి 80 గ్రాముల లడ్డూలు 510 వస్తాయన్నారు. ఈ తరుణంలో నాణ్యతను మరింతగా పెంచేందుకు ఇంకా ఏమైనా అదనంగా ముడిసరుకులు అవసరమా.. అన్న విషయంపై దేవదాయశాఖ కమిషన్ ఆదేశాలతో ప్రతీ దేవాలయంలో ట్రయల్‌రన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సింహాచలంలో ప్రధానంగా మూడు దిట్టాలతో లడ్డూలను తయారుచేసి పరిశీలించినట్లు పేర్కొన్నారు. తొలి దిట్టంతో లడ్డూ పాకం తీసేసరికి 9.330 కిలోల నెయ్యి అవసరమైందని, నాలుగైదు పాకాలు తయారయ్యాక నెయ్యి వినియోగం తగ్గుతూ ఉంటుందన్నారు. దీంతో ఒక దిట్టం లడ్డూల తయారీకి 6 కిలోల నెయ్యి సరిపోతుందా? లేక అదనంగా అవసరమవుతుందా? అన్న విషయంపై కమిషనర్‌కి నివేదిక పంపించనున్నట్లు తెలిపారు. ప్రధాన దేవాలయాల్లో రిపోర్టులన్నీ పరిశీలించిన తర్వాత కమిషనర్ ఒక నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. సింహాచలం దేవస్థానంలో ఇప్పటి వరకు 400 గ్రాముల కల్యాణ లడ్డూను కేవలం నిత్యకల్యాణంలో పాల్గొనే భక్తులకే అందిస్తున్నామని, త్వరలో భక్తుల సౌకర్యార్థం కౌంటర్లలో కూడా విక్రయాలు జరుపుతామన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో వీబీవీ రమణమూర్తి, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా పౌరసరఫరాల సేవలు

పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్



మాట్లాడుతున్న మంత్రి మనోహర్

మహారాణిపేట: పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో ఆయన వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రేషన్ సరుకులను 15 రోజుల పాటు పంపిణీ చేయాలన్నారు. 65 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ప్రతి నెలా 26–30 తేదీల మధ్య ఇళ్ల వద్దకే సరుకులను అందించాలని ఆదేశించారు. దీపం పథకంలో సాంకేతిక సమస్యలను పరిష్కరించి, అర్హులందరికీ లబ్ధి చేకూరేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో ప్రజల నుంచి అదనపు చార్జీలు వసూలు చేస్తున్న డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 25న స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి శ్రీకారం చుడతామన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో స్థానికంగా పండే ధాన్యాన్ని వినియోగించేందుకు ప్రణాళికలు పంపించాలని జేసీలను మంత్రి ఆదేశించారు.

ఫ్లెక్సీలు, క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయాలి

రేషన్ దుకాణాల వద్ద పూర్తి వివరాలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, అలాగే క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించాలని మంత్రి మనోహర్ ఆదేశించారు. డీలర్లు ఏజెన్సీల ద్వారా వచ్చే కమిషన్ మాత్రమే తీసుకోవాలని, ప్రజల నుంచి అదనపు చార్జీలు వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. అలాగే డిజిటల్ చెల్లింపుల విధానాన్ని ప్రోత్సహించాలన్నారు. వలసదారుల వివరాలను సేకరించి, వారికి అనుగుణంగా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. సన్న బియ్యం వచ్చే వరకు పాఠశాలలు, ఎండీయూ వాహనాల వద్ద ఉన్న పాత బియ్యాన్ని ఉపయోగించరాదని స్పష్టం చేశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ వివిధ అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. జేసీ కె. మయూర్ అశోక్, జీసీసీ ఎండీ కల్పనా కుమారి, అనకాపల్లి జేసీ ఎం. జాహ్నవి, విజయనగరం జేసీ సేతుమాధవన్, శ్రీకాకుళం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, విశాఖ డీఎస్‌వో భాస్కరరావు, ఇతర జిల్లాల డీఎస్‌వోలు, డీఎంలు, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు, బీపీసీఎల్, ఐవోసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మరణించి.. ఇద్దరికి కంటి వెలుగై..



నేత్రాలను దానం చేసేందుకు ఒప్పంద పత్రాన్ని అందిస్తున్న పోలిపిల్లి కుటుంబ సభ్యులు

పెందుర్తి: ఓ పెద్దాయన మరణించి ఇద్దరికి కంటి చూపును అందించారు. వివరాలివి.. ఆనందపురం మండలం శొంఠ్యాం గ్రామానికి చెందిన గవర పోలిపిల్లి(65) గుండెపోటుతో మంగళవారం ఉదయం మరణించారు. కుమారులు ఇద్దరూ ఉద్యోగ రీత్యా దూరంగా ఉండడంతో పోలిపిల్లి మృతదేహాన్ని భద్రపరిచేందుకు ఫ్రీజర్ బాక్స్ కోసం పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి దాడి శ్రీనివాస్‌ను మృతుని కుమారుడు సంప్రదించారు. ఈ క్రమంలో నేత్రదానం కోసం శ్రీనివాస్ ప్రతిపాదించగా కుమారులు అంగీకారం తెలిపారు. అనంతరం ఎల్వీ ప్రసాద్ మోహిషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు మృతుడి నేత్రాలను సేకరించి ఐ బ్యాంక్‌కు తరలించారు. ఆరోగ్య సమస్యలు లేకపోతే మరణించిన ఏ వయసు వారి నేత్రాలైనా కనీసం ఇద్దరికి చూపును అందిస్తాయని ఈ సందర్భంగా సాయి ట్రస్ట్ ప్రతినిధి శ్రీనివాస్ తెలిపారు.

స్థాయీ సంఘం ఎన్నిక ఓటింగ్‌పై కార్పొరేటర్లకు అవగాహన

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో బుధవారం నిర్వహించనున్న స్థాయీ సంఘం సభ్యుల ఎన్నిక విధానంపై కార్పొరేటర్లకు అవగాహన కల్పించినట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ పేర్కొన్నారు. ఓటు హక్కు వినియోగించుకునే కార్పొరేటర్లు తప్పనిసరిగా ఫొటో ఐడెంటీ కార్డు తీసుకు రావాలన్నారు. బ్యాలెట్ పేపర్లో అభ్యర్థికి ఎదురుగా ఉన్న గడిలో ఓటర్ మార్క్ వేయాలని, 10 మంది సభ్యుల్ని ఎన్నుకోవల్సి ఉన్నందున ఒక ఓటరు 10 ఓట్లు మాత్రమే వేయాలని, అంతకన్నా ఎక్కువ ఓట్లు వేస్తే ఆ బ్యాలెట్ చెల్లదన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్‌తో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో కీచులాట

సూపరింటెండెంట్ చాంబర్‌లో వైద్యాధికారి, పరిపాలనాధికారి మధ్య వాగ్వాదం

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఓ వైద్యాధికారి, మరో పరిపాలన అధికారి మధ్య అధిపత్య పోరు తీవ్ర స్థాయికి చేరుకుంది. సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి చాంబర్లో ఆమె సమక్షంలోనే ఈ ఇద్దరు అధికారులు ఘర్షణకు దిగారు. ఒకరిపై మరొకరు మాటాలు, అరుపులు, కేకలు వేసుకున్నారు. ఆస్పత్రిని భ్రష్టు పట్టిస్తున్నారంటూ ఒకరిపై మరొకరు మాటాల తూటాలు పేల్చారు. ఆస్పత్రిలో లంచాలు, కమిషన్లకు కారకులంటూ పరస్పరం ఆరోపించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రికి సంబంధం లేని వ్యక్తి క్యాజువాలిటీలో ఫ్యాన్లు, ఏసీ పని చేయకపోవడం, ఆక్సిజన్ అందుబాటులో లేకపోవడానికి ప్రస్తావించారు.ఆస్పత్రిలో జరుగుతున్న విషయాలను మీడియాకు లీక్ చేస్తున్నాంటూ అరుపులతో రెచ్చిపోయారు. వీరి కీచులాట ఆస్పత్రిలో చర్చనీయాశంగా మారింది.

క్లుప్తంగా

డ్రైవర్లకు పని గంటలు పాటించాలి

సీతంపేట: మోటారు రవాణా కార్మికుల చట్టం -1961 ప్రకారం సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు డ్రైవర్లకు పని గంటలు, విశ్రాంతి, విరామాలు తప్పకుండా పాటించాలని కార్మిక శాఖ సంయుక్త లేబర్ కమిషనర్ ఎం.రామారావు అన్నారు. అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో మంగళవారం వివిధ మోటారు రవాణా సంస్థల యజమానులు, ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ రూల్స్ 27, 28 ప్రకారం అధిక పని వేళల్ని నిషేధించి, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్లు ఎల్‌ఐఎస్ వెబ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రవాణా సంస్థల యజమానులు డ్రైవర్ల పని గంటల డిజిటల్ రికార్డులు నిర్వహించాలని, ఓవర్ టైమ్, మిగిలిన సమయాల నమోదు తప్పనిసరన్నారు. సమావేశంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎం.సునీత, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

13న ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు



మద్దిలపాలెం : ఏయూలో ఎంబీఏ, ఎంసీఏ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి.ఎ.నాయుడు పేర్కొన్నారు. ఎంబీఏ ఫుల్ టైమ్ కోర్సులకు ఏడాదికి రూ.1.5 లక్షలు, ఎంసీఏ కోర్సుకు రూ.1.25 లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఐసెట్–2025లో ర్యాంకులకు అనుగుణంగా ప్రవేశాలను కల్పించనున్నామన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 11వ తేదీ లోగా దరఖాస్తులను అందజేయాలని సూచించారు. కౌన్సెలింగ్ ఈనెల 13వ తేదీన జరుగుతుందని ప్రకటించారు.

పారా అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటాలి



పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్

మహారాణిపేట : పోలీస్ బ్యారక్స్ గ్రౌండ్‌లో ఈనెల 9న ప్రారంభం కానున్న రాష్ట్ర స్థాయి 6వ జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిరప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వి.రామస్వామి, విశాఖపట్నం జిల్లా గౌరవ అధ్యక్షురాలు శీతల్ మదన్, గుంటూరు జిల్లా సెక్రటరీ వై.శ్రీనివాస్ గౌడ్, పారా స్పోర్ట్స్ సభ్యులు పాల్గొన్నారు.

విశాఖపట్నం–బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ కొత్తవలస–పెందుర్తి సెక్షన్ మధ్య జరుగుతున్న భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖపట్నం–బ్రహ్మపూర్–విశాఖపట్నం(18525/26) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తక్షణమే ఆపాలి

- సర్దుబాటు, ట్రూఅప్, ఇంధనపు చార్జీలను ఉపసంహరించుకోవాలి
- ఏపీఈపీడీసీఎల్ ఎదుట ప్రజా సంఘాల ధర్నా



ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

తాటిచెట్లపాలెం: విద్యుత్ గృహ వినియోగదారులకు నష్టదాయకమైన విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే నిలిపివేయాలని, ప్రజలపై మోపిన ట్రూ–అప్ చార్జీలు, ఇంధనపు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని విశాఖ కార్మిక, మహిళా, యువజన, విద్యార్థి ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. మంగళవారం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం ముందు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, ఐద్వా, ఎస్‌ఎఫ్‌డబ్ల్యూ, పీఓడబ్ల్యూ, డీవైఎఫ్‌ఐ, ఏఐవైఎఫ్, కేవీపీఎస్ వంటి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్ అచ్యుతరావుల అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్ కంపెనీలను అదానీ వంటి బహుళజాతి సంస్థలకు కట్టబెడుతుంటే, రాష్ట్రంలో కూటమి నేతలు దానికి సహకరించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల సంపదను లూటీ చేయడమే కాకుండా, వారిపై విద్యుత్ భారాలు మోపడం సరికాదని హెచ్చరించారు. 2000 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు భారీగా విద్యుత్ చార్జీలు పెంచినప్పుడు ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టారని, చలో హైదరాబాద్ నిర్వహించినప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ముగ్గురిని పొట్టన పెట్టుకుందని గుర్తు చేశారు. ఇప్పుడు మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రెహమాన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్‌వీ కుమార్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే బద్దలు కొట్టాలని చెప్పారని గుర్తు చేశారు. మరి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక దొంగచాటుగా మీటర్లు ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. జగ్గునాయుడు, పీఓడబ్ల్యూ లక్ష్మి, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దేవ, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు యు.ఎస్.ఎన్. రాజు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వై. సత్యవతి, ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా నాయకురాలు వనజాక్షి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వై. రాజు, ఏఐవైఎఫ్ నాయకుడు అచ్యుతరావు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మూర్తియాదవ్ బ్లాక్ మెయిలర్

- జనసేన కార్పొరేటర్ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు..
- ఎండాడలో 5.10 ఎకరాల భూమికి తనకు సంబంధం లేదు
- ఆరోపణలపై విచారణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా..
- వీఎంఆర్‌డీఏ మాజీ చైర్మన్ చంద్రమౌళి



మాట్లాడుతున్న చంద్రమౌళి

సాక్షి, విశాఖపట్నం : జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఒక బ్లాక్ మెయిలర్ అని వీఎంఆర్‌డీఏ మాజీ చైర్మన్ సనపల చంద్రమౌళి మండిపడ్డారు. ఎండాడలో సర్వే నెంబర్ 14/1లో 5.10 ఎకరాల భూమిని ఫోర్జరీ పత్రాలతో తాను కాజేశానంటూ ఆరోపణలు పచ్చి అబద్ధమని, ఆ భూమికి తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని.. లేదంటే మూర్తియాదవ్‌పై పరువు నష్టం దావా వేయడానికి కూడా వెనుకాడనని హెచ్చరించారు. తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానన్నారు. మంగళవారం మద్దిలపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ సైనిక ఉద్యోగి వై.బాలిరెడ్డికి జీవో నెంబర్ 743/1963 ప్రకారం ప్రభుత్వం ల్యాండ్ అలాట్‌మెంట్ పథకం ద్వారా 1971లో డి.ఆర్. నెంబర్ 5/1381 ద్వారా అసైన్డ్ డీ పట్టా (మాజీ సైనిక ఉద్యోగి కోటా) ఇచ్చారన్నారు. తదుపరి ప్రభుత్వం జీవో నెంబర్ 1117/1993 ద్వారా అసైన్‌మెంట్ చేసిన పదేళ్ల తర్వాత ఎటువంటి ఎన్‌వోసీ లేకుండా సేల్ చేయవచ్చని స్పష్టం చేసిందన్నారు. ఆ భూమికి 2022 మే 4వ తేదీన సీసీఎల్‌ఏ 350/ 2022 ప్రకారం ఎక్స్ సర్వీస్‌మెన్ సేల్స్ పర్మిషన్‌లో కొన్ని గైడ్‌లైన్స్ ప్రకారం కలెక్టర్ ఎన్‌వోసీ ఇచ్చారన్నారు. దానిలో భాగంగా ఎక్స్ సర్వీస్‌మెన్ అయిన వై.బాలిరెడ్డి భార్య ఆనందమ్మ, ఆయన కుమారుడు జోజిరెడ్డి వీలునామా ద్వారా సంక్రమించిన ఆస్తికి కలెక్టర్ ఎన్‌వోసీ కోరడం జరిగిందన్నారు. సంబంధిత రెవెన్యూ డాక్యుమెంట్లను పరిశీలించి విచారణ చేపట్టి ఆనందమ్మకు డీ–పట్టా అలాట్ చేయవచ్చా? లేదా అనేది క్లారిఫికేషన్ వచ్చిన తరువాత ఓపినియన్ కోసం గవర్నమెంట్ ప్లీడర్‌కి పంపించడం జరిగిందన్నారు. ఎన్‌వోసీ వచ్చిన తర్వాత వీలునామా ప్రకారం 376 సెంట్లు జోజిరెడ్డి డెవలప్‌మెంట్ చేసుకోవడానికి హైదరాబాద్‌కు చెందిన వారికి ఇవ్వడం జరిగిందన్నారు. ఆ భూమికి తనకు ఎటువంటి సంబంధం లేదని.. కాదని ఆధారాలు చూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. ఎప్పుడూ ఎవరొకరిపై తప్పుడు ఆరోపణలు చేసుకుంటూ బ్లాక్‌మెయిల్ చేసే మూర్తియాదవ్ లాంటి వ్యక్తులు రాజకీయాలు పనికిరారన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యంతోనే లుపిన్ ఫార్మా ప్రమాదం

మానవ హక్కుల వేదిక వెల్లడి

సాక్షి, అనకాపల్లి: పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో ఉన్న లుపిన్ ఫార్మా కంపెనీలో గ్యాస్ లీకేజీ ఘటన పూర్తిగా యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) వెల్లడించింది. హెచ్‌ఆర్‌ఎఫ్ బృందం పరిశీలనలో వెల్లడైన విషయాలను వేదిక ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అనురాధ, జిల్లా సహాయ కార్యదర్శి రెహ్మాన్ ఒక ప్రకటనలో వివరించారు. ఈనెల 4వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో లుపిన్ ఫార్మాలో మల్టీ ప్రొడక్షన్ బ్లాక్–2లో లేటర్ మూవర్ ఔషధ తయారీ సమయంలో ప్రమాదకమైన విషవాయువులు విడుదలయ్యాయి. ఆ విష వాయువు పీల్చి ఒకరు తీవ్రంగా అస్వస్థతకు గురై ఐసీయూలో, మిగిలిన నలుగురు క్యాజువాల్టీలో చికిత్స పొందుతున్నారు. అయితే అదే రోజు సాయంత్రానికి వారి పరిస్థితి విషమం కావడంతో అందరినీ ఐసీయూలో చేర్చారు. ఈ ఔషధ తయారీ ప్రక్రియలో అత్యంత ప్రమాదకర కెమికల్స్ వాడుతున్నట్లు వెల్లడయ్యింది. ఇటువంటి ప్రమాదకర కెమికల్స్ వినియోగిస్తున్నప్పుడు అవసరమైన నిబంధనలు, సరైన రక్షణ పద్ధతులు పాటించకపోతే తీవ్రమైన శ్వాస సంబంధిత సమస్యలకు దారితీసే ప్రమాదం ఏర్పడుతుందని వెల్లడించారు. విషవాయువులు లీకైన గదిలో ఒక్కరే ఉన్నారని.. ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకుని పక్క గది నుంచి వెళ్లిన మిగిలిన వారు కూడా అస్వస్థతకు గురైనట్టు చెప్పారు. భద్రతను గాలికి వదిలేశారని, నియంత్రణ సంస్థల పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని మానవ హక్కుల వేదిక వెల్లడించింది.

కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను చూసేందుకు కనీసం వారి కుటుంబ సభ్యులను కూడా లోపలకి అనుమతించలేదన్నారు. మానవ హక్కుల వేదిక బృందం రంగంలోకి దిగడంతో లోపలకి పంపించారని తెలిపారు. తీవ్ర అస్వస్థతకు గురైన షిఫ్ట్ ఇన్‌చార్జి ఎం.సాయికుమార్ పరిస్థితి విషమంగానే ఉంది. మిగిలిన వారిలో కెమిస్ట్ గణేష్ మినహా మిగిలిన నలుగురు పి.శివనాయుడు (కెమిస్ట్), కె.రాజశేఖర్‌కుమార్ (షిఫ్ట్ ఇన్‌చార్జి), యు.నరేష్‌కుమార్ (షిఫ్ట్ ఇన్‌చార్జి), బి.రామానాయుడు (ఆఫీస్ స్టాఫ్) ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వెల్లడించారు.

లుపిన్ గ్యాస్ లీక్ బాధితులు సురక్షితం

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని లుపిన్ పరిశ్రమలో ఈ నెల 4న జరిగిన విష వాయువుల లీకేజీలో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ఆరుగురి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. వీరిలో ఐదుగురిని ఆస్పత్రి నుంచి మంగళవారం డిశ్చార్జి చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ప్రొడక్షన్ బ్లాక్‌లో కెమిస్ట్ గణేష్ మాస్క్ ధరించి, షిఫ్ట్ ఇన్‌చార్జ్ సాయి కుమార్ మాస్క్ లేకుండా పనిచేస్తూ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్య సేవల అనంతరం వారి ఆరోగ్య పరిస్థితులు నిలకడగా ఉన్నాయని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కెమిస్టులు రామునాయుడు, సూరినాయుడు, నరేష్, సేఫ్టీ అబ్జర్వర్ పి.రాఘవేంద్రలను ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు జరిపారు. వారికి విష వాయువుల ప్రభావం లేదని వైద్యులు నిర్ధారించడంతో డిశ్చార్జి చేసినట్లు సీఐ తెలిపారు.

ఈతకు వెళ్లిన వ్యక్తి మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

కూర్మన్నపాలెం: సరదాగా ఈతకు వెళ్లిన అనకాపల్లి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కర్రి నాగేశ్వరరావు (29) అనే యువకుడు మృతి చెందాడు. మంగళవారం ఉదయం అతని మృతదేహం తిక్కవానిపాలెం సముద్రతీరంలో లభ్యమైంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగేశ్వరరావు ఈ నెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిక్కవానిపాలెం బీచ్‌లో ఈత కోసం సముద్రంలో దిగాడు. అయితే ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. ఆ రోజు రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో అనకాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం తిక్కవానిపాలెం బీచ్‌లో మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అది నాగేశ్వరరావుగా గుర్తించారు. మృతుడి సోదరుడు నూక అప్పారావు ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగేశ్వరరావు మైలాన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనికి భార్య సంధ్య, తల్లి నూకరత్నం ఉన్నారు. ఐదేళ్ల క్రితం అతనికి వివాహమైందని బంధువులు తెలిపారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన చేస్తున్న ఆటో కార్మికులు

బీచ్‌రోడ్డు : రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల ఆటో కార్మికులకు ఆదాయం తగ్గుతూ ఆర్థికంగా ఇబ్బంది పడతారని.. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల నాయకులతో చర్చించి న్యాయం చేయాలని ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం దగ్గర ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే ఆటో కార్మికులు జీవో నెంబర్ 21 వచ్చిన దగ్గర నుంచి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. యువగళం పాదయాత్ర సమయంలో లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలు ఇవ్వాలని, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్ డీజిల్ ఆటో కార్మికులకు సబ్సిడీ ధరలకు ఇవ్వాలని, ప్రభుత్వం ప్రత్యేక యాప్ తీసుకువచ్చి ఓలా, ఉబర్, రాపిడో వారి నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. వీటిపై ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 11వ తేదీన ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ఆటో స్టాండ్‌ల అధ్యక్షులు గణేష్, కోశాధికారి రాము, ఆలీ, రమణ, గాజువాక ఆటో కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

పెట్టుబడిదారులు అప్రమత్తంగా ఉండాలి

సెబీ ఈడీ రామ్‌మోహన్‌రావు



సదస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: పెట్టుబడిదారులు వ్యక్తిగత శ్రద్ధతోపాటు, సెబీలో నమోదైన మధ్యవర్తుల ద్వారా మాత్రమే వ్యాపారం చేయాలని సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.రామ్ మోహన్‌రావు సూచించారు. సిరిపురంలోని చిల్డ్రన్స్ ఎరీనాలో మెగా రిసా పేరిట పెట్టుబడిదారుల అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. స్మార్ట్ పెట్టుబడి–సురక్షితమైన భవిష్యత్తు వైపు అనే అంశంతో సాగిన సదస్సును కలెక్టర్ హరేందిరప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత, పెట్టుబడిదారుల రక్షణ పట్ల సెబీ నిబద్ధతను వివరించారు. స్కామర్లు, మోసగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సెబీ చీఫ్ జనరల్ మేనేజర్ దీప్తి అగర్వాల్, డీసీపీ కృష్ణకాంత్ పటేల్ పాల్గొన్నారు.

డ్వాక్రా ఆర్పీలే పెట్టుబడిదారులు!

సదస్సులో 800 మందికి పైగా పెట్టుబడిదారులు పాల్గొన్నారని, అందులో 70 శాతం మహిళలే అని గొప్పలు చెప్పారు. నిజానికి వారిలో అత్యధికులు పెట్టుబడిదారులు కాదు. డ్వాక్రా ఆర్పీలను మహిళా పెట్టుబడిదారులుగ సదస్సులో కూర్చొబెట్టారు. పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు లేకపోవటంతో జీవీఎంసీ అధికారులు ఆర్పీలను సదస్సుకు తరలించారు. విషయం బయటకు తెలియటంతో సదస్సులోని ఆర్పీలు చాలా మంది బయటకు పరుగులు తీశారు.

జగదాంబ రాంబాబు కన్నుమూత



డాబాగార్డెన్స్: జగదాంబ థియేటర్ అధినేత వేగి రాంబాబు మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా జగదాంబ థియేటర్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆయన కృషి ఎంతో ఉంది. ఇటీవల ఉత్తమ సింగిల్ స్క్రీన్ ఆఫ్ ఇండియా – 2025 అవార్డు కూడా జగదాంబ థియేటర్ గెలుచుకుంది.

జగదాంబ థియేటర్ విశేషాలు

1970లో చెన్నైకి చెందిన ప్రసిద్ధ నిర్మాణ నిపుణుడు కేఎన్ శ్రీనివాసన్ పర్యవేక్షణలో 4,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని నిర్మించారు. 70 ఎంఎం ప్రదర్శన వ్యవస్థను కనిపెట్టిన ఏవో టాడ్ సూచనల మేరకు ఈ థియేటర్‌ను నిర్మించారు. ఇందులోని వలయాకారపు ర్యాంప్ అప్పట్లో ఒక ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. 1200 సీటింగ్ సామర్థ్యంతో ఉన్న ఈ థియేటర్‌ను 1970 అక్టోబర్ 25న అప్పటి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జేవీ నర్సింగరావు ప్రారంభించారు. తొలి చిత్రంగా 'వేర్ ఈగిల్స్ డేర్' అనే ఆంగ్ల సినిమా ప్రదర్శించారు. జగదాంబ థియేటర్ ప్రాంగణంలోనే శారదా, రమాదేవి థియేటర్లను నిర్మించారు. ఇది విశాఖలోనే తొలి మల్టీప్లెక్స్‌గా గుర్తింపు పొందింది. వైజాగ్‌లో ల్యాండ్ మార్క్స్ అంటే బీచ్, కైలాసగిరితో పాటు జగదాంబ సెంటర్‌కూగా గుర్తుకువస్తుంది.

స్టీల్‌ప్లాంట్‌లోని ప్రైవేటు క్యాంటీన్లు మూసివేత

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ప్రైవేటు క్యాంటీన్లు, పాన్ షాపులు మూసివేయాలని యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయా క్యాంటీన్లు, పాన్ షాప్‌ల నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో అధికారికంగా సుమారు 15 క్యాంటీన్లు నిర్వహిస్తున్నారు. వారు నిర్ణీత వేళల్లో ఉదయం టిఫిన్, టీ, మధ్యాహ్నం భోజనం, రాత్రి వేళ టిఫిన్ అందిస్తారు. ప్లాంట్‌లోని సుమారు 44 విభాగాలకు చెందిన ఉద్యోగులకు ఈ క్యాంటీన్లు దూరాభారం కావడంతో ఆయా విభాగాల వద్ద ప్రైవేటు క్యాంటీన్లు వెలిశాయి. ఇప్పుడు ప్లాంట్‌లో దాదాపు 70 క్యాంటీన్లు ఉన్నాయి. అదే విధంగా పలు పాన్ షాపులు ఏర్పాటయ్యాయి. వాటి నిర్వాహకులకు గేటు పాసులు ఆయా విభాగాల అధికారులు సమకూర్చుతున్నారు. వారు ప్లాంట్‌కు చెందిన విద్యుత్, నీరు, ప్యాకింగ్ ఉడ్, బొగ్గును ఉచితంగా వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో కొంత మంది క్యాంటీన్లు, పాన్ షాపులు ఉచితంగా విద్యుత్, నీరు తదితర మౌలిక సదుపాయాలను వినియోగిస్తున్న తీరును ఉక్కు మంత్రిత్వశాఖకు ఫిర్యాదు చేశారు. తద్వారా కోట్లాది రూపాయలు నష్టం వస్తున్నట్టు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఉక్కు యాజమాన్యం ఆయా నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. దీంతో నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. ఈ నోటీసులపై హెచ్‌ఆర్ యాజమాన్యాన్ని కలిసి తమ గోడును వెల్లబోసుకోవాలని నిర్ణయించారు. వారి వద్ద నుంచి అద్దె, విద్యుత్, నీటి చార్జీలను వసూలు చేయడం ద్వారా వారిని కొనసాగిస్తారా? లేక వాటిని శాశ్వతంగా మూసివేస్తారా అంశంపై ఉక్కు యాజమాన్యం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

రెండున్నర టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలు

పెదగంట్యాడ: పక్కదారి పట్టిన రేషన్ బియ్యాన్ని న్యూపోర్టు పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. మండలంలోని కొత్త దిబ్బపాలెంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. బొలేరా వాహనంలో తరలిస్తున్న రెండున్నర టన్నుల బియ్యాన్ని పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాని అనే వ్యక్తి ఈ బియ్యాన్ని తరలిస్తున్నాడని న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ కామేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అధ్యాపకుడు మందలించాడని గోస్తనీలో దూకిన విద్యార్థి

తగరపువలస : అధ్యాపకుడు మందలించాడని చెరకుపల్లిలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన రెండో సంవత్సరం విద్యార్థి కె. యశ్వంత్ మంగళవారం ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కళాశాలకు సమీపంలో ఉన్న గోస్తనీ నదిలోకి దూకాడు. అయితే సకాలంలో స్పందించిన పోలీసులు, ఈతగాళ్ల సహాయంతో అతడిని కాపాడారు. విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన యశ్వంత్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. తరగతి గదిలో తరచూ సెల్‌ఫోన్ వాడుతున్నందుకు అధ్యాపకుడు అతడిని మందలించారు. దీంతో ఆగ్రహానికి గురైన యశ్వంత్, కళాశాల నుంచి బయటకు వచ్చి జాతీయ రహదారిపై ఉన్న వంతెన నుంచి నదిలోకి దూకాడు. అతడిని వెంబడించిన తోటి విద్యార్థులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు, బ్లూకోట్స్ కానిస్టేబుల్ రామ సురేష్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, ఈతగాళ్ల సాయంతో యశ్వంత్‌ను బయటకు తీశారు. అనంతరం అతడిని భీమిలి పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థి తండ్రిని పిలిపించి కుమారుడిని అప్పగించారు.

12 గంటల్లో 10 రోబోటిక్ శస్త్ర చికిత్సలు



రోబోటిక్ శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్ రవిచంద్ర బృందం

ఆరిలోవ: హెల్త్‌సిటీ కేర్ ఆస్పత్రిలో 12 గంటల్లో 10 రోబోటిక్ టోటల్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా జరిపినట్లు మోకాలి మార్పిడి సర్జన్ డాక్టర్ రవిచంద్ర తెలిపారు. ఇది ఒక కీలక ఘట్టమన్నారు. అత్యాధునిక వెలిస్ రోబోటిక్ సిస్టమ్ సహాయంతో ఆర్థోపెడిక్ వైద్య బృందం తన ఆధ్వర్యంలో ఈ శస్త్ర చికిత్సలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఒకే రోజు, ఒకే సర్జన్ ద్వారా ఇన్ని శస్త్ర చికిత్సలు జరపడం రాష్ట్రంలోనే ఇది తొలిసారిని తెలిపారు. డాక్టర్ రఘు యలపర్తి, డాక్టర్ రాజనాయుడు, డాక్టర్ అజయ్ శస్త్ర చికిత్స ప్రక్రియకు దోహదపడ్డారన్నారు. కేర్‌లో వైద్య బృందం నైపుణ్యం వల్ల ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ వైద్య బృందాన్ని కేర్ సీవోవో మయూఖ్ చౌదరి అభినందించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు దుర్గాప్రసాద్



దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

భీమునిపట్నం: రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి పల్లంటి దుర్గాప్రసాద్ ఎంపికై య్యాడు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో ఈనెల 9,10,11 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, అధ్యాపకులు అభినందించారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రారంభం

డాబాగార్డెన్స్: శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు నగరంలోని జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న శ్రీకృష్ణ చైతన్య మఠంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఆగస్టు 17 వరకు జరగనున్నాయి. మంగళవారం శ్రీకృష్ణుడి మందిరాన్ని పువ్వులతో అలంకరించారు. బుధవారం వివిధ రకాల పండ్లతో అలంకరించనున్నారు. గురువారం ఆకులు, 8న మొక్కలతో అలంకరించనున్నారు. 9న డీప్ డెకరేషన్, 10న నాట్యజరీ సంగీత నృత్యాలయ నేతృత్వంలో నృత్య ప్రదర్శన, 11న రూపా కూచిపూడి డ్యాన్స్ అకాడమీచే నృత్య ప్రదర్శన, డ్రాయింగ్, పాట్ పెయింటింగ్, 12న సుధా అండ్ కుమారి గ్రూప్‌చే సుందరకాండ పారాయణం, భగవద్గీత రెసిటేషన్, 13న క్లాసికల్ డ్యాన్స్ అకాడమీచే శ్రీకృష్ణ నృత్య భారతి, డ్రామా పోటీలు, 14న సప్తస్వర భక్తి గీతాంజలి, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, 15న శ్రీ స్వరరాగ భక్తి గీతాంజలి, 16న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే జన్మాష్టమి రోజున 108 కళశాలతో అభిషేకం చేపట్టనున్నారు.